విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 14, మే 2025

మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం
జిల్లాకు తీరని లోటు
సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు శివన్న

విశాలాంధ్ర-ఉరవకొండ : మాజీ ఎంపీ ధరూరు పుల్లయ్య మరణం అనంతపురం జిల్లాకు తీరనిలోటని, సిపిఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గం సీనియర్ నాయకులు ఎస్.శివన్న అన్నారు. మంగళవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీటి మళ్లింపుతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని భావించి ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఎన్నో పోరాటాలు సాగించాడని, అలాగే అనంతపురం నగరంలో ఏపీ లైటింగ్స్ పరిశ్రమను స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిన దార్శనికుడని.. రెండుసార్లు ఎంపీగా గెలిచి అనంతపురం పార్లమెంటును ప్రగతి పథాన నడిపించడంతో పాటు, అనంతపురం జిల్లాను ఎడారి నుండి కాపాడడం కోసం కృషి చేశాడని, సిద్ధాంతాలు వేరైనా జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు పక్కన పెట్టి, కమ్యూనిస్టు పార్టీ యోధుడు వీకే ఆదినారాయణ రెడ్డి తో కలిసి పని చేశారని ఆ కారణంగా అతని మరణానంతరం" వి.కే ట్రస్ట్" ఏర్పాటు చేయడంతో పాటు అతని పేరు మీదుగా వీకే ట్రస్ట్ భవనం నిర్మాణానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ధరూరు పుల్లయ్య మరణంతో నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఒక తరం అంతరించిందని పేర్కొన్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని డి.హీరేహాల్ గ్రామంలో మంగళవారం అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ మంజుల బాలల హక్కులు. బాలల రక్షణ గురించి కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. విద్యా హక్కు జీవించే హక్కు మొదలగు హక్కుల గురించి తెలియజేస్తూ వాళ్ళు ఎలా రక్షణ పొందాలి తెలియజేశారు. ఆరోగ్యపరమైన విషయాలు రక్తహీనత ఆరోగ్య సమస్యలు గురించి తెలిపారు. ఇతర గ్రామాలలో అంగన్వాడీ కేంద్రంలో బాలల హక్కు బాలల సంరక్షణ గురించి కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యం.ఎస్. కె.పుష్పవతి, అంగన్వాడి టీచర్, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-శింగనమల : మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో 1999లో 15 మంది ఎస్సీ రైతులకు సర్వే నెం 213, 214లో ఒక్కొక్కరికి రెండెకరాలు చొప్పున ప్రభుత్వం భూమినిడీ ఫారం పట్టా మంజూరు చేశారని, అప్పటినుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ బ్యాంకు రుణాలు పొంది జీవనోపాధి పొందుతున్నారని, రీ సర్వే పేరుతో సర్వే నంబర్లు మార్పు చేసి ఎస్సీలకు సంబంధించిన భూమి సర్వే నంబర్లు కొత్త నెంబర్లు కావడంతో ఆ భూమిని మిగులు భూమిగా అధికారులు చూపించడం సమంజసం కాదని, తక్షణమే ఎస్సీలకు న్యాయం చేయాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న బందారు కుళ్లాయప్ప, బాధిత రైతులు డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భూమిని సర్వే చేయించి సబ్ డివిజన్ ద్వారా ఎస్సీ రైతులకు ఆన్లైన్ లో బాధిత ఎస్సి రైతుల పేర్లు నమోదు చేయాలని, డిమాండ్ చేశారు. తాసిల్దార్ కార్యాలయంలో దళితులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు నగేష్, రమేష్, గ్రామ రైతులు లక్ష్మీనారాయణ, కుళ్లాయి స్వామి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు
పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కణేకల్లు : గాలివానకు విద్యుత్ స్తంభాలు. ఒరిగిపోతున్నాయి... ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. కనకల్ మండలంలోని మాల్యం సొల్లాపురం గ్రామ నల్లరేగుడి పొలాల్లో విద్యుత్ స్తంభాలు క్రిందికి పూర్తిగా పడిపోతున్నాయి. వీటిని విద్యుత్ అధికారులు చూసీచూడనట్లుగా వెళ్ళిపోతున్నారు. మాల్యం నుంచి ఉరవకొండకు వెళ్లే దారిలో ఉన్న ఈ స్తంభాల ద్వారా ఉరవకొండకు నుండి కనేకల్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ స్తంభాలు ఒకవేళ పడిపోతే కనేకల్ మండల పరిధిలోని అన్ని గ్రామాలు అంధకారం అవుతాయి. ఈ స్తంభాలు పూర్తిగా పడిపోతే విద్యుత్ వైర్లు కూడా పూర్తిగా ఒక్కొక్కటి తెగిపోతాయి. అలాగే జరిగితే చుట్టుపక్కల విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలబడిపోతుంది. ఇకనైనా అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మురుగు కాలువలను నాణ్యతతో నిర్మించాలి..

విశాలాంధ్ర-రాప్తాడు : ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న మురుగు కాలువలను నాణ్యతతో వేయాలని ఎంపీడీవో బి విజయలక్ష్మి సూచించారు. మైనార్టీ కాలనీలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మంగళవారం తనిఖీ చేశారు. కాలువల నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ స్వాతి ఉన్నారు.

సైనికుల విజయం కోసం ప్రత్యేక పూజలు..
శత్రు నాశనం కోసం జనసేన నాయకులు..

విశాలాంధ్ర-తాడిపత్రి : ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్ మీద చేస్తున్న ధర్మ యుద్ధంలో మన దేశ సైనికులు విజయం సాధించాలని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కుందుర్తి నరసింహ ఆచారి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన కాళికాదేవి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆదేశానుసారం శత్రునాశనం జరగాలని కాళికాదేవికి ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో జనసేన యాడికి మండల అధ్యక్షులు కోడి సునీల్ తాడిపత్రి మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్ పెద్ద పప్పూరు మండల నాయకుడు బైపి రెడ్డి పాల్గొన్నారు.

17న గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, స్పీకర్, మంత్రుల రాక

- పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలి జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో పాల్గొననున్న మంత్రులు
- కలెక్టర్ వినోద్ కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం: రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, శాసనసభ స్పీకర్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, తదితరుల జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల జిల్లా అధికారులు, జేఎన్టీయూ విసి, ఇతర మండల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన గవర్నర్ అబ్దుల్ నజీర్ జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గవర్నర్ 17వ తేదీన ఉదయం రైలు ద్వారా అనంతపురం చేరుకుంటారని, అనంతరం జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం గంటలకు రైలు ద్వారా బయలుదేరి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఓవరాల్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఉంటారన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అధికారుల టీం, వాహనాలు, లైజన్ అధికారులు ఉండాలని, వాహనాల కాన్వాయ్‌లో అంబులెన్స్ ఉండాలని, భోజన ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. జేఎన్టీయూలో డయాస్ ప్రణాళిక ప్రకారం జరగాలని, 16వ తేదీన డ్రస్ రిహార్సల్స్ చేయాలని, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైయిజన్ (ఏఎస్ఎల్) కార్యక్రమం నిర్వహించాలన్నారు. సెక్యూరిటీ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డిఓ కేశవ నాయుడు, టౌన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏపీఎస్పీ డీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్, నెడ్క్యాప్ డీఎం, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు

విశాలాంధ్ర-గుంతకల్లు : రాగులపాడు దగ్గర పిల్ల కాలువలు ఏర్పాటు చేసి గుంతకల్ నియోజకవర్గంలో 12 చెరువులకు నీళ్లను నింపుతామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారని.. ఇది టిడిపి ప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో వేల రూపాయలు ఖర్చు చేసి నలిగిపోయి ఉన్న నిరుపేదలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసి ఆదుకున్నారని చెప్పారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో 19 మందికి రూ. 8,52178ల చెక్కులు అందజేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చినపుడు నుండి గుంతకల్ నియోజకవర్గంలో 14 సార్లు సీఎంఆర్ఎఫ్ శాంక్షన్ చేయడం చాలా సంతోషదాయకమనిఅన్నారు. కార్యక్రమంలో గుంతకల్ మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ డాక్టర్ సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ హిమబిందు, టిడిపి పట్టణ అధ్యక్షుడు బందారు ఆనంద్, అంజి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, లాయర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ డీఎస్సీని సద్వినియోగం చేసుకోండి ...

విశాలాంధ్ర-గుంతకల్లు : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డీఎస్సీ గోడపత్రికలను గుంతకల్ ఎమ్మెల్యే జయరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు డిఎస్సీ అభ్యర్థుల కోసం ఈ నెల 24వ తేదీన మన గుంతకల్‌లో మోడల్ డీఎస్సీని అభ్యర్థులందరూ వినియోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్య శాఖ మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువతని దృష్టిలో ఉంచుకొని ఈ మెగా డీఎస్సీని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి రాయల్ రంగ మాట్లాడుతూ మేధావులచే మోడల్ పరీక్ష ప్రశ్నా పత్రాన్ని తయారు చేయించామని, మోడల్ పరీక్షలో మొదటి 10 ర్యాంకులకు నగదు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. ఇతర వివరాలకు 9885262354 సంప్రదించాలని సూచించారు.

సిబిఎస్ఈ ఫలితాల్లో మాంటిస్సోరి ప్రభంజనం

విశాలాంధ్ర-రాప్తాడు: సీబీఎస్ఈ 10 ఇంటర్ ఫలితాల్లో మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల ప్రభంజనం సృష్టించిందని ఎండి కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీరా మంగళవారం తెలిపారు. పదో తరగతి ఇంటర్మీడియట్ ఫలితాలు వందకు వందశాతం ఉత్తీర్ణతతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇంటర్‌లో చైత్ర అనే విద్యార్థిని 459/500 మార్కులతో, పదవ తరగతి లో పార్థీవ్ రెడ్డి 486 /500 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఎండీ కృష్ణ భరత్ మాట్లాడుతూ నేటి విద్యా ప్రపంచంలో సాంకేతికత అనుగుణంగా ఉన్నత విలువలను, నాణ్యమైన విద్యను అందిస్తూ ఈ ప్రగతిని సాధించామని గర్వంగా తెలిపారు. కరస్పాండెంట్ కృష్ణ సమీరా మాట్లాడుతూ ఇలాంటి అత్యున్నత ఫలితాలను సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం మరువలేనిదన్నారు. ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో మాంటిస్సోరి పాఠశాలలో గుణాత్మక, నైతిక విలువలు బోధిస్తున్నామన్నారు.

శ్రీ విజన్ కాలేజీపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: శ్రీ విజన్ కళాశాల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల ఇంటర్ రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న తీర్థన అనే విద్యార్థి ఒక సంవత్సరం వృధా అయింది. బాధ్యులైన కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య నాయకులు విద్యార్థి తల్లిదండ్రులతో మంగళవారం ఆర్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ పూర్తిచేసుకున్న కీర్తన మొదటి సంవత్సరంలో మాక్స్ 1ఏ సబ్జెక్టు పెండింగ్ ఉండడం వలన 22వ తేదీ విద్యార్థి తండ్రి కళాశాల యాజమాన్యం శంకరయ్యను సంప్రదించగా ఫోన్ పే ద్వారా మీరు ప్రభుత్వ రుసుము చెల్లించ లేదని అందుకు మేము ఏమి చేయగలమని నిర్లక్ష్యంగా సమాధానంచెప్పడంతో విద్యార్థినీ తండ్రి విస్తుపోయాడు.. మీరు చెప్పిన ప్రకారం ఆన్ లైన్ ద్వారా రూ.1500లు చెల్లించామని కానీ కళాశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వలన విద్యార్థిని తీర్థన ఫీజు ఇంటర్ బోర్డుకు యాజమాన్యం చెల్లించకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ఇంటర్ పరీక్ష ఫీజు 650 రూపాయలు అయితే కానీ కళాశాల యాజమాన్యులు విద్యార్థినితో 1500 రూపాయలు వసూలు చేశారని తెలిపారు.. ఇప్పుడు విద్యార్థిని సంవత్సరం పాటు తన చదువును కళాశాల యాజమాన్యుల నిర్లక్ష్యం వల్లనే వృధా చేసుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.. విద్యార్థిని ప్రస్తుతం ఎంసెట్‌కు అర్హురాలని కాకుండా చేసిన కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐ ఓను కోరారు. తక్షణమే శ్రీ విజన్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, చందు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గిరి, అజయ్ ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి సహాయ కార్యదర్శి సమీర్, ఆశిష్, సుఫియాన్, బాబు, నరేష్, కేదుర్, అరవింద్ ఎస్ఎఫ్ఐ సాయి తదితరులు పాల్గొన్నారు.

20న వ్య.కా.సం. దేశవ్యాప్త కార్మిక, గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి
ఏపీ వామపక్ష వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

విశాలాంధ్ర-అనంతపురం/కూడేరు : వ్యవసాయ కార్మికులు, రైతు, కౌలు రైతు రుణాలను రద్దు చేయాలని, ఉపాధి హామీని నిర్వీర్యం చేసి నీరుగార్చే చర్యలను వ్యతిరేకించాలని, ఉపాధిలో 200 పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ.700లు ఇవ్వాలని, ప్రతి ఉపాధి కూలీకి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఉపాధి భృతి కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20న దేశంలోని అన్ని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు వ్యవసాయ కూలీలు, పేదలు సంఘటితమై కదలిరావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పెరుగు సంగప్పలు మంగళవారం పిలుపునిచ్చారు. కేంద్రంలో 2014 లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల పొట్టకొట్టే విధంగా పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో తిరోగమన సంస్కరణలు, విధానాలు అనుసరించడం చాలా దారుణమన్నారు. గత శతాబ్ద కాలంగా కార్మికులు సాధించుకున్న చట్టాలన్నీ రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో 4 లక్షల 60 వేల కోట్లరూపాయలు ఉపాధి హామీకి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం తాలూకు అధ్యక్షులు మలరాయుడు, నాయకులు శ్రీరాములు. మంచినీళ్ల వరప్రసాద్ పాల్గొన్నారు.

అకాల వర్షాల వల్ల నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోండి

- నిమ్మ తోటలను పరిశీలించిన రైతు సంఘం, సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని చందన రోడ్డులో మంగళవారం రాత్రి గాలి వానకు అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న నిమ్మతోట రైతు గొడ్డుమర్రి బయన్న, రమేష్ పొలాన్ని ఏపీ రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వి వెంకటరాముడు యాదవ్, యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ యాడికి మండల కేంద్రానికి చెందిన రైతులు బయన్న, రమేష్ తమకున్న మూడు ఎకరాల భూమిలో నిమ్మచెట్లను నాటారు. మంగళవారం రాత్రి వీచిన గాలివానకు అకాల వర్షానికి సుమారు 35 చెట్లు నేలకొరిగాయి. సుమారు రైతుకు 2 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. పంట చేతికొచ్చే సమయంలో చెట్లు నేలకొరవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు బయన్న, రమేష్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో దైవాల మడుగు, చందన గ్రామాల మధ్యలో 6 టీఎంసీల సాగునీరు, తాగునీరు ప్రాజెక్టు ఏర్పాటుకు అంచనా వేశారున్నారు. కానీ ఆ ప్రాజెక్టు ఏర్పాటు అయితే యాడికి మండలంలో సాగునీరు సమస్య లేకుండా ఉంటుందని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ముందుకురావాలని కోరారు. ఈ అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులను జాతీయ విపత్తుగా భావించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డెరాముడు పట్టణ కార్యదర్శి చిన్న కుల్లాయి రెడ్డి పట్టణ సహాయ కార్యదర్శి వెంకటస్వామి సిపిఐ నాయకులు బీసీ రామప్ప పాల్గొన్నారు.

కాలుష్యానికి బలవుతున్న ప్రభుత్వ పాఠశాల

విశాలాంధ్ర-రాయదుర్గం: డి.హిరేహాళ్ మండలంలోని సోమలాపురం గ్రామ రైల్వే స్టేషన్ దగ్గర ఇనుప ఖనిజం లోడింగ్ అన్లోడింగ్ కార్యకలాపాలు భారీగా జరుగుతున్నాయని.. దీనివల్ల సోలాపురం ప్రభుత్వ పాఠశాల కాలుష్యానికి బలవుతున్నదని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందునూర్ నాగరాజు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే వ్యాగన్ నుంచి వందలాదిమంది లేబర్లు ఇనుప ఖనిజాన్ని పారలతో కిందికి లాగడం వలన .. వందలాది లారీల వలన ఆ ప్రాంతమంతా విపరీతమైన దుమ్ము ధూళితో నిండిపోయి తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపైన తీవ్రమైన దుష్పరిణామాలకు దారితీస్తుందన్నారు. చిన్న చిన్న ధూళి రేణువులు నీరు, ఆహారాన్ని, నీటిని విషతుల్యం చేస్తున్నా యని మండిపడ్డారు. దగ్గరలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో వందలాదిగా విద్యార్థులు ఇనుప ఖనిజం ద్వారా వచ్చే ధూళిని పీల్చుకుని అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. శ్వాసకోశ సమస్యలు ఏర్పడి ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తున్నా యన్నారు. ఇనుప ఖనిజం ధూళిలో ఉండే సిలికా వల్ల సిలికోసిస్ అనే క్యాన్సర్ వచ్చి ప్రాణాలకు ముప్పు ఏర్పడంతో పాటు పిల్లల ఎదుగుదల కుంటుపడే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మానసిక విలాంగులుగా, బుద్ధి మాంద్యం వచ్చే అవకాశాలు చాలా వరకు ఉన్నాయని నిపుణులు చెబుతున్నా రని పేర్కొన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇనుప ఖనిజం రవాణా అయినా ఆపాలి లేకపోతే జిల్లా పరిషత్ హైస్కూలును అక్కడి నుంచి దూరంగా తరలించాలని కోరారు.

తారు రోడ్డును ప్రారంభించిన జెసి ప్రభాకర్ రెడ్డి

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని చందన గ్రామంలో రాయలచెరువు నుండి చందన వరకు నూతనంగా నిర్మించిన తారు రోడ్డును మంగళవారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన చందన, రాయలచెరువు రోడ్డును టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తి వేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ట్రాన్సుఫార్మర్ల సమస్య ఉందని తెలియజేయగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. లక్ష్మంపల్లెలో విందు కార్యక్రమానికి హాజరయ్యారు..

20న కాలవ ఫౌండేషన్ క్రికెట్ క్రీడా పోటీలు..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : మండలంలోని ఉద్దేహాల్ జెడ్‌పీ హెచ్ మైదానంలో ఈనెల 20న కాలవ ఫౌండేషన్ తరుపున క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు రవిచంద్ర, రమేష్, రవి తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకలు సందర్భంగా కె.సి.ఎల్-2 పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో అసక్తి గల యువత పోటీలో పాల్గొనాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో జరిగిన వారికి మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు ఇస్తారని ఇక్కడ గెలుపొందిన వారికి నియోజకవర్గ స్థాయిలో పోటీలు జరుగుతాయని అన్నారు. అక్కడ విన్నర్‌కు రూ.లక్ష, రన్నర్కు రూ.50 వేలు అందజేస్తున్నాట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14వ స్నాతకోస్తవానికి ఎంపికైన గోల్డ్ మెడలిస్ట్ జాబితా విడుదల..

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (అనంతపురం) 14వ స్నాతకోస్తావానికి 2023-24లో ప్రతిభకు పట్టం వేస్తూ.. గోల్డ్ మెడలిస్ట్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితాను, వివరాలను పరీక్షల విభాగం మంగళవారం వెల్లడించింది. బీటెక్ యూనివర్సిటీ గోల్డ్ మెడల్ లిస్ట్ లో12 మంది విద్యార్థులు, బీఫార్మసీలో ఒక్కరు, పులివెందుల కళాశాలలో బీటెక్ టాపర్స్ 5, అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ లో6,1982 ఎండోమెంట్ గోల్డ్ మెడలిస్టు 2, ఎండోమెంట్ గోల్డ్ మెడలిస్టు అనుబంధ కళాశాలలో 13, ఎంటెక్ గోల్డ్ మెడలిస్ట్ ఎండోమెంట్ 1 ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల వివరాలను విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె..

విశాలాంధ్ర-కూడేరు: శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందని సిఐటియూ రాష్ట్ర నాయకులు కె.ఓబుళు అన్నారు. మంగళవారం పీఏ బీరు డ్యామ్ లోని శ్రీరామ్ రెడ్డి త్రాగునీటి ప్రాజెక్టు పథకంలో పథకంలో పనిచేస్తున్న కార్మికులతో సమ్మెలోకలిసి ఆయన మాట్లాడారు.వారి డిమాండ్ల కొరకు ఆరు నెలలు బకాయి జీతాలు 40 నెలలు ఈపీఎఫ్ చెల్లించేంతవరకు సమ్మె కొనసాగుతుందని దీనికి అధికారులు మూడుసార్లు హామీ ఇచ్చి కార్మికులను అన్యాయం చేశారన్నారు అందువలన చర్చలు విఫలము కావడంతో.సమ్మె కొనసాగుతుందని కార్మికులు తేల్చి చెప్పేశారు ఈ చర్చల్లో 200 మంది కార్మికులు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ సిఐటియు జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ స్వామి యూనియన్ కార్యదర్శి రాము ట్రెజరర్ వన్నూరు స్వామి నాగరాజు కొండారెడ్డి రామంజి వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అక్కమ్మకు జల్ది పూజ
నేడు పరుష పూజ

విశాలాంధ్ర-ఆత్మకూరు: మండల కేంద్రంలో మంగళవారం అక్కమ్మ గారి పరుషలో భాగంగా కొలను పూజ నిర్వహించి గిరిగెల గంపను ఉరుముల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామంలోని దేవాలయానికి తీసుకువచ్చారు. కొలను పూజ గిరిగెల పూజ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. అక్కమ్మ గారికి పరుష చేయించిన ప్రతిసారీ కొత్తగా గిరిగెలను చేయించి కొలను పూజ నిర్వహించి కొలను వద్ద నుంచి గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. ఒట్టిమి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు ఈ ఏడు అక్కమ్మ గారి పరుష సొంత ఖర్చులతో నిర్వహింప చేశారు. గిరిగెల గంప ఊరేగింపు చూడడానికి ప్రజలు తండోపతండాలుగా తరలివస్తారు. బుధవారం పరుష నిర్వహించనున్నారు. ఆలయానికి వెళ్లే వీధి లో వివిధ రకాలైన అంగళ్లు ఏర్పాటు చేశారు. కొలను వద్ద మంగళవారం ఉదయం నుంచి సాయంకాలం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ట్రాన్స్‌కో అధికారులకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ (రేణుకాఎల్లమ్మ దేవాలయం)ప్రాంతంలో 270 నివాస గృహాలకు గాను గతంలో 60కెవిఎ ట్రాన్సుఫారం ఉండేదని, ఓవర్ లోడు వల్ల టీవీలు బల్బులు మీటర్లు ఫ్యాన్లు మోటార్లు తదితర విద్యుత్ పరికరాలు కాలిపోయేవని, గత వారంలో రేణుక ఎల్లమ్మ దేవతను దర్శించుకొనుటకు మండల విద్యుత్ అధికారి మధుసూదనరావు వచ్చినప్పుడు ఆ ప్రాంత వాసులు అందరూ విద్యుత్ పరిస్థితిని వివరంగా విన్నవించుకోవటంతో ఆ సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు అధిక కెపాసిటీ గల 100 కేవిఎ ట్రాన్ఫార్మర్ మంజూరు చేసి ఏర్పాటు చేయడంలో రేణుక ఎల్లమ్మ గుడి ప్రాంత నివాసులందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయండి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలోని వన్నళ్లి గ్రామంలో అర్ధంత రంగ ఆగిపోయిన అంగన్వాడీ భవనం పూర్తి చేయాలని స్థానిక టీడీపీ నాయకులు కె.పి వన్నూరుస్వామి, రామస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతు గత ప్రభుత్వంలో రూ.16 లక్షలతో అంగన్వాడీ భవనం ప్రారంభించారని మధ్యలోనే భవనం నిర్మాణం పనుల నిలిపివేసినట్లు తెలిపారు. అధికారులును ప్రశ్నిస్తే రూ. 16 లక్షలు నిధులు ఖర్చు అయినట్లు అం టున్నారని తెలిపారు. భవనం పూర్తీ కాకుండానే ఏలా మొత్తం నిధులు ఖర్చు అవుతాయని అన్నారు. సొంత భవనం లేకపోవడంతో చిన్నరులు, గర్భవతులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని ఆగిపోయిన భవనం పూర్తీ కాకపోవడంతో కమ్యూటీ భవనంలో అంగన్వాడీ సెం టర్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో అంగన్వాడీ భవనాలు మొండి గోడలతో దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయని విమర్శించారు. వైసీపీ పాలనలో నిధులను గోలుమాల్ చేశారని ఆరోపించారు. విచారణచేసి భవనం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలి..

సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి : హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచుతూ చివరి ఆయకట్టుకు నీరుందిస్తామన్నా ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.కాటమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఎన్జీవో హోంలో హంద్రీ నీవా సాధన సదస్సుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం మహాదేవ్ అధ్యక్షుతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హంద్రీనీవాను పదివేల క్యూ సెక్కుల సామర్థ్యంతో కాలువలు వెడల్పు చేసి ఆరు లక్షల ఎకరాలకు సాగులూరు అందించి లైనింగ్ పనులు చేపట్టాలన్నారు. మూడు దశాబ్దాలుగా కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లింపు కొనసాగు తూనే ఉందని ముఖ్యమంత్రి మారిన రాయలసీమ రైతుల సమస్యలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులకు హంద్రీనీవా ద్వారా సాగునీరు, తాగునీరందించి రాయలసీమ కరువు ప్రాంతాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హంద్రీనీవాను పట్టించుకోక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పొలాలు బీడు గా మారాయన్నారు. జిల్లాలో రెండు లక్షల 60 వేల ఎకరాలకు ఆయకట్టు సాగు, తాగు నీరు అందిస్తూ,పిల్ల కాలువ పనులను తక్షణం చేపట్టి అనంతరం కుప్పంకు నీరు కేటాయించా లన్నారు. సీపీఐ అభివృద్ధికి వ్యతిరేకం కాదని రైతాంగానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ అధ్యక్షులు కమతం కాటమయ్య, జంగాల పెద్దన్న, వ్యకాసం జిల్లా కార్యదర్శి కదిరప్ప, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి అంజన్ బాబు,సూర్యనారాయణరెడ్డి, సిపిఐ డివిజన్ కార్యదర్శి పవన్,లియాకత్, చౌడప్ప, రమణ, ఈశ్వరయ్య,రెడ్డయ్య, పెద్ద ఎత్తున రైతులు, మహిళా సంఘ నాయకురాలు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోండి..

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

విశాలాంధ్ర-పుట్టపర్తి : జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రానున్న వినాయక చవితి ఉత్సవ వేడుకలను నిర్వహణకు సంబంధించి ముందస్తు సన్నాహాలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవా లని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళ వారం కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిఆర్ఓ విజయ సారథితో కలిసి కదిరి ప్రాంతానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పలు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు,సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాదిలో రానున్న వినాయక చవితి వేడుకలు ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులను గుర్తించి సామరస్యంగా ప్రశాంత వాతావరణలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవ పండుగను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కదిరి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుత తరుణంలో విగ్రహాలను తయారు చేయు సందర్భంగా తయారీదారులు రసాయనిక కార్బన్ రహిత విగ్రహాలను తయారు చేయాలని, విగ్రహాల ఎత్తును కూడా తగిన మోతాదులో చిన్నగా రూపొందించాలని సూచించారు. ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. కదిరి పట్టణంలో వినాయక చవితి పందిళ్లు (మండపాలు) వేసే ముందు మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక శాఖ, అనుమతిని కచ్చితంగా తీసుకోవాలని అన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకాలు ఇతర సమస్యలు లేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టాలని దీనికై జిల్లాపోలీసు యంత్రాంగం మార్గదర్శకాలు రూపొందించి వాటిని కచ్చితం గా అమలు చేయాలని ఆదేశించారు.

యువతకు ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి...
- రాష్ట్ర బీసీ శాఖామంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సవితమ్మ అన్నారు. పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మెగా జాబ్ మేళాను ప్రారభించిన మంత్రి సవితమ్మ .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడి యట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఎంబీఏ, ఎంసిఏ చదివిన నిరుద్యోగ యువత దాదాపు రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగావకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా యువత కెరీర్ కు ఎంతో దోహదపడుతుందని అన్నారు. సుమారు 50 కి పైగా వివిధ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని నైపుణ్యాలను బట్టి ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జాబ్‌మేళా ద్వారా ఉద్యోగ అవకాశా లను నిరుద్యోగ యువత అందిపుచ్చుకోవాలన్నారు. వివిధ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుం దని మంత్రి సవితమ్మ తెలిపారు. మంగళవారం జరిగిన మెగా జాబ్ మేళాలో 50 కంపెనీలకు పైగా పాల్గొన్నాయి, నిరుద్యోగ యువతీ యువకులు 1023 పాల్గొన్నారు, అలాగే జాబ్ మేళాలో 430 మంది ఎంపికైనట్లు తెలిపారు, వచ్చిన నిరుద్యోగులు అందరికీ మంచి భోజన సౌకర్యాన్ని మంత్రి ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో అధికారులు ఆర్ డి ఓ ఆనందరావు, తాసిల్దార్ శ్రీధర్ , డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ కేశవ రావు,పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ కన్వీనర్ హెూదా ఎవరిని వరిస్తుందో,..?

రేసులో 16 మంది....

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలో టిడిపి పార్టీ కన్వీనర్ పోస్టు ఎవరని వరిస్తుందో అంటూ మండల ప్రజలు . టిడిపి కార్యకర్తలు నాయకులు, తహతహలాడుతున్నారు, ఈ నేపథ్యంలో అధికారంలో తెలుగుదేశం పార్టీ ఉండడంతో చిలమత్తూరు మండలంలో టిడిపి కన్వీనర్ పదవి కోసం మొత్తముగా ఒకరు కాదు.. ఇద్దరు కాదు,.. 16 మంది మండల కన్వీనర్ బాధ్యతకు పోటీ పడడంతో ఆ పార్టీ అధిష్టానం ముక్కున వేలు వేసుకుంది. అధికారంలో లేనప్పుడు ఆ పదవికి ఆసక్తి చూపని వారు కూడా, ఆ పదవి మాకే కావాలంటూ ఎమ్మెల్యే బాలయ్య క్యాంప్ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు, నేనంటే నేనేనని ఎవరికి వారు అధిష్టానం పిలుపు కోసం పోటీ పడుతున్నారు. ఏకంగా తమదైన శైలిలో జన సమీకరణ చేసి జేజేలు, కొట్టించుకుంటున్నారు. తమదైన శైలిలో పలువురు నాయకు లను ఆకర్షితులు చేస్తున్నారు, పార్టీనే నమ్ముకున్న సీనియర్లకు న్యాయం చేయాలని, పార్టీలు మారే వారికి పదవులు కట్టబెట్ట రాదని చర్చించుకుంటున్నారు. సంకేతాలు అందిస్తున్నారు, నియోజకవర్గంలో హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండల కన్వీనర్ లను మార్చే యోజనలో ఉంది. ఈ నేపథ్యంలో చిలమత్తూరు మండల కన్వీనర్ స్థానానికి పోటీ పడుతున్నారు. ఇప్పటికే కన్వీనర్ పదవి స్థానానికి దరఖాస్తు చేసుకున్నారు, చోటా మోటా అని తేడా లేకుండా మండల కన్వీనర్ బాధ్యతలు కోసం పోటీ పడుతున్నారు, ఎమ్మెల్యే బాలయ్య ఫిర్యాదుతో తమకే అవకాశం కల్పించాలని ప్రాధేయ పడుతున్నారని సమాచారం, మండల కన్వీనర్ బాధ్యతలు ఎవరికి ఇవ్వాలన్నది పార్టీ పెద్దలు సమాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేధావులు సీనియర్ నాయకులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ సమీపంలో గల విశ్వ శ్రీ విద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో మంగళవారం ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్రబాబు, కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దాదాపు 16 మంది కన్వీనర్ బాధ్యతలు చేపట్టేందుకు తమదైన శైలిలో ముందుకు వచ్చారు. అయితే మండల కన్వీనర్ బాధ్యతలు ఎవరిని వరిస్తాయో వేచి చూడాల్సిందే.

మైనారిటీ యువకులను కొట్టారని అర్ధరాత్రి ధర్నా ..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కళాజ్యోతి కూడల వద్ద సోమవారం అర్ధరాత్రి సమయంలో ముస్లిం మైనారిటీలు మంగళ వారం ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని సీతారాంపల్లి వద్ద గల దాబా హెూటల్లో ధర్మవరానికి చెందిన మైనారిటీ యువకులు, సౌదీ, బాబా, దాదుపై చంద్ర అతని వర్గీయులు దాడి చేశారని ధర్నా నిర్వహించారు. కళాజ్యోతి కూడలి వద్ద రాస్తారోకో చేయడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు గంటలకు నిలిచిపోయి ట్రాఫిక్ గురైంది. ప్రయాణికులు వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరకు డీఎస్పి హేమంత్ కుమార్ అక్కడికి చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. మాపై దాడి చేసిన ధాబా యజమాని తోపాటు చంద్ర అతని వర్గీయులు పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డి.ఎస్.పి మైనార్టీ యువకులు, మైనార్టీ పెద్దలతో చర్చించి వెనువెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

ఘనంగా అన్నమయ్య జయంతి

విశాలాంధ్ర-ధర్మవరం: అన్నమయ్య జయంతి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామ లాలిత్య శిష్య బృందం 50 మంది చే ఆలపించిన నాట్యాలు అందరిని అలరారించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు, సీనియర్ బిజెపి నాయకులు అంబటి సతీష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ అంబటి అరుణ శ్రీ, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ళ వెంకటేష్ హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ అన్నమయ్య చరితం నృత్య రూపకమును కళాకారులు ప్రదర్శిం చడం నిజంగా సంతోషించేతగ్గ విషయమని తెలిపారు. అతిధుల చేతుల మీదుగా నాట్యమనులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. తదుపరి గురువు బాబు బాలాజీను కూడా ఘనంగా సత్కరించారు.

14 వరకు శాస్త్రోక్తంగా హెూమాలు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణ శివానగర్లో ఈనెల 10వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహెూత్సవ వేడుకలు అత్యంత వైభవంగా దేవాలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురుస్వామి పి. జె.విజయ్ కుమార్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, బండ్లపల్లి వెంకట జయప్రకాష్, అయ్యప్ప స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగవ రోజు ఉదయము, సాయంత్రము కలసస్థాపనతోపాటు ఆవాహిత దేవత, పురుష సూక్త పునరచ్చరణ, ఉదకశాంతి అయ్యప్ప సహస్రనామార్చన, పూర్ణాహుతి, మంత్రపుష్పం, శయ్యాధివాసం, వేద స్వస్తి తదితర హెూమాలు మంగళ వాయిద్యాలు నడుమ అర్చకులు నిర్వహించారు. ముఖ్యంగా పవమాన, మహా సుదర్శన హెూమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తదుపరి కంచి పీఠాధిపతి విరుపాక్షి విద్యారణ్య భారతి స్వామీజీ ఈ కార్యక్రమాల కు ముఖ్యఅతిథిగా విచ్చేసి కలశ స్థాపనలో పాల్గొని, దేవాలయ నిర్మాణ విషయంలో తగు మార్గదర్శకం చేశారు. తమ ఆశీస్సులను అందజేశారు. హిందూ ధర్మాన్ని పాటించకపోవడం వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారు అన్న విషయాలను కూడా తెలియజేయాలని తెలిపారు. స్వామీజీ వివిధ హెూమాలలో, ధ్వజ సంభాస్థాపనలో, విగ్రహ స్థాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు గురు స్వామి విజయకుమార్, కీర్తిశేషులు కలవల నాగరాజు కుటుంబ సభ్యులు, బండ్లపల్లి వెంకట జయప్రకాష్ , అయ్యప్ప మాలధారణ భక్తాదులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ముస్లింల అస్తిత్వానికి ఎక్కడ ప్రమాదం ఉన్నా.. అక్కడ నేనుంటా

పరిటాల శ్రీరామ్..

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం నియోజకవర్గం లోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ ముస్లింల అస్తిత్వానికి ప్రమాదం వచ్చినా.. అక్కడ నేను ఉంటానని పరిటాల శ్రీరామ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ధర్మవరం సమీపంలోని ఒక దాబాలో సోమవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి ఆయన స్పందించారు. కొందరు వ్యక్తులు దాదాఖలందర్‌పై దురుసుగా వ్యవహరించడం జరిగిందని. ఈ సంఘటనపై రాత్రి వేళ ముస్లింలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారన్న విషయం తెలుసుకున్న పరిటాల శ్రీరామ్ వెంటనే స్థానిక సీఐ,, డీఎస్పీలకు ఫోన్ చేసి మాట్లాడారు. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ విషయాన్ని కొందరు తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో పరిటాల శ్రీరామ్ స్పందించారు. పోలీసులు స్వేచ్ఛగా చర్యలు తీసుకోవాలని తాను కోరినట్లు వివరించారు. దీంతో పోలీసులు కూడా వెంటనే కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే తాను ఇంత వేగంగా స్పందిస్తానని కొందరు వ్యక్తులు ఊహించి ఉండరని.. ఈ గొడవను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యా యన్నారు. తాను ఇంత వేగంగా స్పందిస్తానని వారు కూడా ఊహించి ఉండరని, ధర్మవరంలో ముస్లింలకు ఏ కష్టం వచ్చినా ముందుంటాడని స్పష్టం చేశారు. తాను ఆంజనేయ స్వామిని ఎలా ఆరాధిస్తానో అల్లాను కూడా అలాగే ఆరాధిస్తానని స్పష్టం చేశారు.

శ్రీరామ్ అర్ధరాత్రి వేళ ఫోన్ చేసి అండగా నిలిచారు...

సోమవారం రాత్రి మామిళ్ళపల్లి వద్ద ఉన్న దాబాలో తన పట్ల కొందరు వ్యక్తులు అనుచితంగా వ్యవహరించారని ఈ విషయాన్ని తెలుసుకున్న మా స్నేహితులు నాకు అండగా నిలిచారని దాదా కలందర్ తెలిపారు. అదే సమయంలో పరిటాల శ్రీరామ్ కూడా అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఫోన్ చేసి నాకు అండగా నిలిచారు. ఈ ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకునే విధంగా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పరిటాల శ్రీరామ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

సైనికులకు దైవ ఆశీస్సులుండాలని పూజలు

విశాలాంధ్ర- ధర్మవరం : పాకిస్తాన్‌తో యుద్ధం చేసే భారత సైనికులకు భగవం తుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కుక్కే సుబ్రమణ్య స్వామి ఆలయంలో మంగళవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు వరుణ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానమంత్రి యుద్ధ విషయంలో తీసుకునే నిర్ణయానికి మా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

విశాలాంధ్ర-ధర్మవరం : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. మంగళవారం వారు పట్టణంలోని ఇందిరా నగర్, గీతానగర్, పిఆర్టి వీధి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సచివాలయంలోని పలు రిజిస్టర్లను, రికార్డులను స్వయంగా పరిశీలించారు. రికార్డులను రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు సంబంధిత విషయాలను తప్పక నమోదు చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. కొన్ని సచివాలయాలలో ఉద్యోగానికి రాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుండి ఆకస్మిక తనిఖీ నిరంతరం ఉంటుందని, అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు.

సీపీఎం భూ కబ్జాలపై ప్రెస్‌క్లబ్ తీర్మానం

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని, అనంతపురం మెయిన్ రోడ్డులో ఉన్న కొల్లకుంట్ల సమీపంలో గల జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని సీపీఎం పార్టీ, పేదల పేరుతో కబ్జా చేస్తూ ఎర్రజెండా ఆవిష్కరించడాన్ని హిందూపురం ప్రెస్‌క్లబ్ వారు మంగళవారం ఖండించారు. సీపీఎం వార్తలను పత్రికల్లో, టీవీ ఛానెళ్లలో ప్రచురించకుండా నిలిపివేయాలని తీర్మానించారు. పేదల పేరుతో అనవసర కార్యక్రమాలకు పోలీసులు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు.

మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం..

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని కొడికొండ చెక్ పోస్ట్ జాతీయ రహదారిలో కర్ణాటక సరిహద్దు బాగేపల్లి టోల్గేట్ వద్ద నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున జగనుకు పూలమాలలు పుష్పగుచ్ఛా లతో ఘన స్వాగతం పలికారు. పాకిస్తాన్ యుద్ధంలో మరణించిన మురళి నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న సందర్భంగా స్థానిక నాయకులు దీపిక వేణురెడ్డి, నవీన్ నిశ్చల్, కొండూరు వేణు గోపాల్ రెడ్డి, చౌలూరు మధుమతి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

గుడిబండ ఎంపీడీఓగా కేశవరెడ్డి



విశాలాంధ్ర-గుడిబండ : మండల ఎంపిడిఓగా కేశవరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఓడి చెరువు మండలంలో డిప్యూటీ ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారుకావాలి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఇంటికొక పారిశ్రామికవేత్త ను తయారుచేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కప్పల బండ సమీపంలో ఏపిఐఐసి ఆధ్వర్యంలో సూక్ష్మ, చిన్న మధ్యతర పరిశ్రమల వాడ కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కప్పలబండ పారిశ్రామిక వాడలో 104 ఎకరాలలో రూ 154 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగ అవకాశా లతో పాటు ఆదాయ రంగం పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పుట్టపర్తి పారిశ్రామికవాడ ఆంధ్రప్రదేశ్ రోల్ మోడల్ కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇక్కడ చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, 2014 నుంచి 2018 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కప్పల బండ వద్ద 104 ఎకరాలు సేకరించి పారిశ్రామిక వార్డును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో దూర దృష్టితో పారిశ్రామిక సంఘాన్ని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ పుట్టపర్తి సమీపంలో కప్పలబండ ప్రాంతంలో పారిశ్రామిక వార్డునుఅన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సువర్ణ ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ ఏపీఐఐసీ, డీఐసి అధికారులు ఎంపీపీ రమణారెడ్డి, టిడిపి కన్వీనర్ రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టే బాధ్యత మనందరిదీ..

విశాలాంధ్ర-పుట్టపర్తి: బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అధికారులు అందరీ పైన ఉందని పుట్టపర్తి ఆర్డిఓ పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో సైబర్ నేరాలు బాల్య వివాహాలు, అరికట్టే విషయంపై,ఆటో కాంపెయిన్ బ్యానర్లు, వాయిస్ ద్వారా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి సేవా సంఘం సెక్రెటరీ విరనారప్ప సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ సీడీపీఓ గాయత్రితో కలిసి జెండా ఊపి ఆటో కాంపెయిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సైబరుమయమైన ప్రపంచంలో మన వివరాలు అన్ని గోప్యంగా ఉంచుకోవలసిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఎవరైనా పిల్లలకు బాల్య వివాహం చేసినట్టు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటా మన్నారు. తల్లిదండ్రులు పిల్లల నడవడిక చూసుకుంటూ మొబైల్ వాడకం పట్ల జాగ్రత్తగా ఉండే విధంగా పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిసిపిఓ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప,ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, సోసియల్ వర్కర్ ఆనంద్, జగదీష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విశాలాంధ్ర-కదిరి : నియోజకవర్గంలోని 18మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. మంగళవారం ఆయన ఆర్అండ్‌బి వసతిగృహంలో కదిరి నియోజకవర్గం కు చెందిన 18 మందికి మంజూరైన 16లక్షల, 32వేల, ఆరు వందల అరవై నాలుగు రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుపేదల విద్య వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు.

పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ కార్మికులు మంగళవారం కమిషనర్ సతీష్‌కుమార్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఈనెల 20 తేదిన సమ్మెలో కార్మికులందరూ పాల్గొంటున్నారని, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సమ్మె నిర్వహిస్తున్నామని, ప్రధానంగా కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ,కార్మికుల జనాభాకు జనాభా అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చింది కార్మిక హక్కుల హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహిస్తున్నదని, సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు కరణ్, మనీ, గజేంద్ర, మహేష్, బావక్క, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా లక్ష్మీనరసింహులు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని సీతిరెడ్డిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా బి. లక్ష్మీనారాయణ బాధ్యతలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో కర్నూల్ జిల్లా దేవనకొండ జూనియర్ కళాశాల లో జూవాలాజీ అధ్యాపకులు గా పనిచేశానన్నారు. మారుమూల గ్రామీణ ప్రశాంత వాతావరణం, సువిశాల%శీ%గా ఉన్న కళాశాల లో ఉత్తమ ఫలితాలు సాధన, కళాశాల అభివృద్ధి కోసం అధ్యాపకుల సహకారం, విద్యార్థుల తల్లిదండ్రులను మమేకం చేస్తూ కళాశాలను ఉత్తమ కళాశాల గా పేరు నిలబెట్టడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గత 8 సంవత్సరాలనుండి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన హిస్టరీ అధ్యాపకులు శ్రీ ప్రభాకర్ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

నిరక్షరాసులను గుర్తించండి ..

విశాలాంధ్ర-కొత్తచెరువు : ఉల్లాస్ రెండో విడత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్,మధు సూదన్‌లు పుట్టపర్తి ఏరియా మండలాలకు సంబంధించిన వెలుగు సిసిలు,ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, మధుసూదన్‌లు మాట్లాడుతూ కొత్తచెరువు, బుక్కపట్నం మండలాలకు సంబంధించిన గ్రామాలలో 18 సంవత్సరాలు నిండిన నిరక్షరాస్యుల గుర్తించా లని, గుర్తించిన నిరక్షరాసుల వివరాలను వయోజన విద్యాశాఖ వారు ఇచ్చిన ప్రొఫార్మాలో పొందుపరచాలని తెలిపారు. ప్రతి 10 మంది నిరక్షరాస్యులకు వాలంటీర్‌ను నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య పర్యవేక్షకులు సుధాకర్, మధుసూదన్, ఏరియా కోఆర్డినేటర్ పద్మావతి కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

19న మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక

విశాలాంధ్ర-కదిరి: కదిరి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక 19న నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారు.గత నెలలో చైర్ పర్సన్ నజిమున్నీసా, వైస్ చైర్ పర్సన్ లు గంగాదేవి, అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి పై అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో వారిని ఆయా హెూదాల నుండి తొలగించి ఎన్నిక నిర్వహిస్తున్నారు.15లోపు ఎక్స్ అఫిషియో సభ్యునికి నోటీసులు అందించాలని కమిషనర్ పేర్కొన్నారు. 19ఏదైనా అనివార్య కారణాల వలన వాయిదా పడితే మరుసటి రోజు ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

విశాలాంధ్ర-నంబులపూలకుంట : కదిరి మండలం తెల్లగుట్టపల్లి గ్రామానికి చెందిన గంగాధర్ అను వ్యక్తి మంగళవారం సాయంత్రం బత్తినగారిపల్లి లో జరిగిన విందులో పాల్గొని ద్విచక్ర వాహనంలో ఎన్‌పి కుంటకు వస్తుండగా మండల కేంద్రానికి సమీపంలోని మోరీలమిట్ట దగ్గర వాహనం అదుపు తప్పి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళు తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా కానిస్టేబుల్ రమణ,హెూమ్ గార్డు మౌలాసాబ్ ఘటనా స్థలానికి వెళ్లారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రున్ని పోలీసు వాహనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్య సేవల నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 14, మే 2025

సొంతూరులో పరిశ్రమలు పెట్టండి..

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమి పూజ
ఎంఎస్ఎంఈ పార్కులతో ప్రతి ఇంటి నుంచి ఓ వ్యాపారవేత్త

విశాలాంధ్ర-పెనుకొండ : ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.మన యువతకు ఉద్యోగిలిచ్చి రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్త లకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏపీని పారిశ్రామిక హబ్‌గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

తొలి దశలో 20 ఎకరాల్లో.. రొద్దం ఎంఎస్ఎంఈ పార్కులో తొలి దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్లు చొప్పున భూ కేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సదావకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఒకవైపు రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తూనే, మరో వైపు సాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులను తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా రూపురేఖలే మారిపోయాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువత ఎక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు, సొంతూర్లోనే కంపెనీలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ఆదాయం...స్థానిక ప్రజలకు, ప్రభుత్వానికి లభ్యమవుతుందన్నారు.

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని, ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి బయటకు పంపించేశారని అన్నారు. జే ట్యాక్స్ చెల్లించాలంటూ పారిశ్రామికవేత్తలను వేధించారని, ఫలితంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. దీనివల్ల ఉద్యోగాల్లేక యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎంచంద్రబాబు నాయుడు మరోసారి అధికారంలోకి రావడంతో, పారిశ్రామిక రంగానికి ఊతమొచ్చిందని తెలిపారు. ఎందరో బడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్నారని వెల్లడించారు. ఆర్డీవో ఆనంద రావు తాసిల్దార్ శ్రీధర్ జిల్లా పరిశ్రమల అధికారి సంజీవులు ఏపీఐఐసీ సీ సోని, కూటమి నాయకులు, శ్రీరామ్ యాదవ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి ..

- ఉదయం 6 గంటల నుంచే డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలి
: కలెక్టర్ వినోద్‌కుమార్.వి

విశాలాంధ్ర-అనంతపురం : అనంతపురం నిర్మలానంద నగర్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. అలాగే కమర్షియల్ ఏరియా నందు ప్రతిరోజు చెత్తను తొలగించే విధంగా చూడాలని, నగరంలోని శానిటేషన్ సెక్రటరీలు సెట్స్ (వాకి టాకీ) ఉపయోగించాలని, ప్రతి 350 ఇండ్లకు చెత్తను సేకరించుటకు ఒకమైక్రో పాకెట్ అటెండర్, 2 వర్కర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ పారిశుద్ధ తనిఖీల్లో భాగంగా ప్లాస్టిక్ చెత్త తొలగించుటకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, వార్డులో ఎంతమంది శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నారు.. గృహాల నందు చెత్తను సేకరించుటకు ఏ సమయం నుండి ఏ సమయం లోపల గృహాలలో చెత్తను సేకరించుటకు సానిటేషన్ వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు, దుకాణదారులు ప్లాస్టిక్ చెత్తను దుకాణం ఎదుట రోడ్డుపై వేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, తదితర విషయాలను వార్డు సెక్రటరీ, ఎమ్హెచ్ఓ, మున్సిపల్ కమిషనర్లను అడిగి తెలుసుకున్నారు. నగరంలోని దుకాణదారులకు తడి చెత్త, పొడి చెత్తకు వేరువేరుగా ఉండేటట్లు దుకాణం వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని, షాపునకు వచ్చు వినియోగదారులు ఉపయోగించుకోవాలన్నారు. షాపు ఎదుట చెత్త వేస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెచ్.ఐ.వి,ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-గుంతకల్లు : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు కళా బృందంతో వీధి నాటకాల ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వీది నాటకం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ క్షయ వ్యాధి సంబంధం, సుఖ వ్యాధులు చికిత్స, కండోమ్ ఉపయోగం, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017 గురించి ప్రజలకు తరిమెల రాజు కళా బృందం వారు చక్కగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఏరియా ఆసుపత్రి ఐసిటిసి కౌన్సిలర్ ప్రసాద్ ప్రగతి మైత్రి మహిళా సంఘం గుంతకల్లు ప్రెసిడెంటు కమల,ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, ఏఎన్ఎం నజుమున్నిసా ఓ.ఆర్.డబ్ల్యూ లక్ష్మీదేవి, లక్ష్మీపతి, సరస్వతి, ఎల్లమ్మ, మంగమ్మ, పీర్ ఎడ్యుకేటర్స్ అలాగే కళాకారులు వెంకటేశు, బాలు, పుష్పా, సరోజ, దివాకర్ పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మంగళవారం ఎంపీపీ ఈటే రాము అధ్యక్షతన బదిలీపై వెళ్లిన అధికారులకు ఎంపీడీవో కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఇంచార్జ్ ఎంపీడీవోగా పని చేసిన అంజనప్ప,ఏపీవోగా పనిచేస్తున్న మంజులలను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. డిఎల్‌పిఓ అంజనప్ప ఏడు నెలలుగా ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేశారు. అలాగే ఏపీవో మంజుల బదిలీపై ఒడిసి మండలానికి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపిడివో పార్థసారథి, ఈవోఆర్డీ మాధవరెడ్డి,టైపిస్ట్ జకావుల్లా,సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

విశాలాంధ్ర-నంబులపూలకుంట : ఖరీఫ్ సీజనుకు సంబంధించి మండలంలో మొత్తం 560 మట్టి నమూనాల సేకరణ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని నంబులపూలకుంట గ్రామంలో రైతు హైదర్ వలి పొలంలో మట్టి నమూనా ఎలా సేకరించాలి అనే విషయంపై రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాధార భూములలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మరియు నీటి వసతి కింద మూడు పంటలకు ఒకసారి భూసార పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. పోషక పదార్థాల గురించే కాక భూమిలో చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు మట్టి పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం రైతులకు ఉందన్నారు. తర్వాత దానికి అనుగుణంగా చేసిన ఎరువుల సిఫారసు బట్టి మనం మన పొలంలో ఏ ఏ ఎరువులు చల్లుకోవాలని ఈ యొక్క మట్టి పరీక్ష ద్వారా మనకు తెలుస్తుంది అని వ్యవసాయ అధికారి వివరించారు. అలాగే మట్టి నమూనా సేకరించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా ఆయన వివరించారు. 2024 ఖరీఫ్ సంబంధించి భూసార పరీక్ష పత్రాలు ఇదివరకే ఆయా గ్రామాల్లో రైతు సేవ కేంద్రాలలో రైతులకు అందించి సిఫారసు మేరకు ఎరువులు ఎలా వాడాలో తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష, రైతు సేవా కేంద్రం సిబ్బంది యుగంధర్, ధనలక్ష్మి, ఇంతియాజ్ పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణ పంపిణీ

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని సంత మార్కెట్లోని రైతు భరోసా కేంద్రంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, వ్యవసాయ అధికారులు కలిసి మంగళవారం, రైతులకు రాయితీపై పశువుల దాన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడి కబీర్ భాష మాట్లాడుతూ 50 శాతం రాయితీపై రైతులకు పశువుల దాన అందజేస్తున్నామని తెలిపారు. యాడికి మార్కెట్ వీధిలో గల రైతు భరోసా కేంద్రంలో పశువుల దాన అందుబాటులో ఉన్నదని దరఖాస్తు చేసుకున్న రైతులందరూ తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, ఐటీడీపీ అధ్యక్షులు నరసింహ చౌదరి, వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

వర్చ్యుసా కంపెనీ నియామకాలకు
పివికెకె ఐటీ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ : పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో వర్చ్యుసా నిర్వహించిన ప్రత్యేక ఆఫ్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో 66 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు.. వీరిలో 29 మంది పివికెకె ఐటి కళాశాల విద్యార్థులు ఉన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు తెలిపారు. ఏపీఐటీఏ ఆధ్వర్యంలో నియామక ప్రక్రియ చేపట్టారన్నారు. కళాశాల చైర్మన్ డా.పల్లె కిషోర్ మాట్లాడుతూ ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజయ శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ డా.భాను కిరణ్ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర మహిళా సమావేశంలో
వైసీపీ మహిళా విభాగ అధ్యక్షురాలు

విశాలాంధ్ర-కణేకల్లు : కనేకల్ మండలం రాయదుర్గం నియోజకవర్గం మహిళా విభాగం అధ్యక్షురాలు కన్నారీ ఉషారాణి విజయవాడ నందు రాష్ట్ర మహిళ సమావేశం సమావేశంలో మంగళవారం పాల్గొన్నారు. రాయదుర్గం నియోజకవర్గమహిళా అధ్యక్షురాలు కన్నారి ఉషారాణి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరదు కళ్యాణిని మర్యాదపూర్వకంగా మరియు సజ్జల రామ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కాసేపు రాయదుర్గం నియోజకవర్గం గురించి చర్చించుకున్నారు.

హంస వాహనంపై ఊరేగిన నారసింహుడు

విశాలాంధ్ర-ఉరవకొండ: పెన్నహెూబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి హంస వాహనోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు హంస వాహనంపై మాడవీధుల్లో దర్శనమిచ్చారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. బ్రహ్మోత్సవాల్లో వేకువజామున మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులకు, స్వామివారి మూలవిరాట్ కు అర్చనలు, మంగళ హారతులను అర్చకులు నిర్వహించారు. అనంతరం హంస వాహనంపై అందంగా అలంకరించి ఉత్సవ మూర్తులను వైభవంగా ఊరేగించారు. హంస అంటే జ్ఞానానికి ప్రతీకగా పేర్కొంటారు. హంసలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏంటంటే.. నీళ్లను, పాలను వేరుచేసే స్వభావంతో ఇది ప్రత్యేకంగా నిలిస్తుంది. భక్తుల్లో నెలకొన్న అహంభావాన్ని తొలగించి జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి ప్రసాదించేందుకు స్వామి వారు హంస వాహనంపై కనిపిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఈఓ సాకే రమేష్ బాబు, అర్చకులు ద్వారకనాథ్, బాలాజీ, గుండురావు, ఉత్సవదాతలు,భక్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు..

విశాలాంధ్ర-గుడిబండ: సి.సి.గిరి గ్రామ సరిద్దుల్లో 11 మంది పేకాట రాయులు పేకాట స్థావరాలు ఏర్పాటు చేసుకుని పేకాట నిర్వహిస్తున్న వ్యక్తులపై గుడిబండ పోలీస్ సిబ్బంది మెరుపు దాడి నిర్వహించారు. జూదరుల నుండి 1,28,000, 10 మొబైల్ ఫోన్లు 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులపై గ్రామస్తులు ప్రత్యేకంగా నిఘ ఉంచి సమాచారం అందించాలన్నారు.

ఇంగ్లీష్ గ్రామర్‌పై అవగాహన..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్‌లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో ఉచిత శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఇంగ్లీష్ గ్రామర్, ఇంగ్లీషులో చదువుటపై అవగాహనను టీచర్ కే.ముకుంద టీచర్ ద్వారా మెలకువలను, శిక్షణగా ఇవ్వడం జరిగిందని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ చదువుతో పాటు తెలుగు ప్రామాణికంగా తీసుకుంటూ, ఇంగ్లీషులో రాయట చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడు ప్రపంచంలో ఎక్కడనైనాను జీవించగలిగే అవకాశం ఉందని తెలిపారు. ఆంగ్లంలో గ్రామర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడు మరింత నైపుణ్యత పెంపొందించవచ్చునని తెలిపారు. ఆంగ్లంపై మెలుకువలను తెలుసుకున్నప్పుడు ఎంతో ఉపయోగపడుతుందని, సులభతరం అవుతుందని తెలిపారు. గణిత విషయంపై వెన్నెల టీచర్ ద్వారా పలు పద్ధతులను నేర్పించడం జరిగిందన్నారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రంథాలయాలలో చదువు, పోటీ పరీక్షలు, వివిధ విభాగాలకు చెందిన అంశాలకు గల పుస్తకాలు కూడా ఉచితంగా లభిస్తాయి అంతేకాకుండా మా గ్రంథాలయంలో ఉచిత సభ్యత్వములు కూడా నిర్వహిస్తున్నామని కేవలం ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చినచో, రుసుమును దాతల ద్వారా సేకరించడం జరుగుతుందని ఇటువంటి అవకాశాన్ని కూడా పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో రమణ నాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

అకాల వర్షాల వల్ల నష్టపోయిన
ఉద్యాన రైతులను ఆదుకోండి ..

▸ నిమ్మ తోటలను పరిశీలించిన రైతు సంఘం, సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని చందన రోడ్డులో మంగళవారం రాత్రి గాలి వానకు అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న నిమ్మతోట రైతు గొడ్డుమర్రి బయన్న, రమేష్ పొలాన్ని ఏపీ రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు వి.వెంకట రాముడు యాదవ్, యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ మాట్లాడుతూ యాడికి మండల కేంద్రానికి చెందిన రైతులు బయన్న, రమేష్ తమకున్న మూడు ఎకరాల భూమిలో నిమ్మచెట్లను నాటారు. మంగళవారం రాత్రి వీచిన గాలివానకు అకాల వర్షానికి సుమారు 35 చెట్లు నేలకొరి గాయి. సుమారు రైతుకు 2 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. పంట చేతికొచ్చే సమయంలో చెట్లు నేలకొరవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు బయన్న, రమేష్ ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో దైవాల మడుగు, చందన గ్రామాల మధ్యలో 6 టీఎంసీల సాగునీరు, తాగునీరు ప్రాజెక్టు ఏర్పాటుకు అంచనా వేశారున్నారు. కానీ ఆ ప్రాజెక్టు ఏర్పాటు అయితే యాడికి మండలంలో సాగునీరు సమస్య లేకుండా ఉంటుందని ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ముందుకురావా లని కోరారు. ఈ అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులను జాతీయ విపత్తుగా భావించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డెరాముడు పట్టణ కార్యదర్శి చిన్న కుల్లాయి రెడ్డి పట్టణ సహాయ కార్యదర్శి వెంకటస్వామి సిపిఐ నాయకులు బీసీ రామప్ప పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-శింగనమల : మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో 1999లో 15 మంది ఎస్సీ రైతులకు సర్వే నెం 213, 214లో ఒక్కొక్కరికి రెండెకరాలు చొప్పున ప్రభుత్వం భూమినిడీ ఫారం పట్టా మంజూరు చేశారని, అప్పటినుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ బ్యాంకు రుణాలు పొంది జీవనోపాధి పొందుతున్నా రని, రీ సర్వే పేరుతో సర్వే నంబర్లు మార్పు చేసి ఎస్సీలకు సంబంధించిన భూమి సర్వే నంబర్లు కొత్త నెంబర్లు కావడంతో ఆ భూమిని మిగులు భూమిగా అధికారులు చూపడం సమంజసం కాదని, తక్షణమే ఎస్సీలకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న బండారు కుల్లాయప్ప, బాధిత రైతులు డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భూమిని సర్వే చేయించి సబ్ డివిజన్ ద్వారా ఎస్సీ రైతులకు ఆన్‌లైన్‌లో బాధిత ఎస్సీ రైతుల పేర్లు నమోదు చేయాలని, డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో దళితులకు న్యాయం చేయకపోతే భవిష్యత్తులో ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు నగేష్, రమేష్, గ్రామ రైతులు లక్ష్మీనారాయణ, కుల్లాయి స్వామి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలలో ఆదర్శప్రాయులు
మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య

విశాలాంధ్ర-ఉరవకొండ: రాజకీయాలలో మాజీ పార్లమెంట్ సభ్యులు ధరూరు పుల్లయ్య ఆదర్శప్రాయులుగా కీర్తి గడిచారని ప్రస్తుతం ఆయన మరణం తీరని లోటని బంజారా సంఘం జాతీయ నేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్.కె కేశవ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ పుల్లయ్య ఉరవకొండ సమితి అధ్యక్షులుగా ఉన్నప్పుడు నేను అతి చిన్న వయసులో సర్పంచుగా ఎన్నికై ఆయనతో కలిసి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో రాజకీయ సేవలు అందించామని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పుల్లయ్య బలహీన వర్గాల పక్షపాతిగా రాజకీయ విలువలను కాపాడుకుంటూ అనంతపురం జిల్లా ప్రజానీకానికి అనేక సేవలు అందించారన్నారు అనంతపురం జిల్లాలో ఏపీ లైటింగ్ పరిశ్రమ నెలకొల్పి ఎంతోమందికి ఉపాధి కల్పించారని జల సాధన కమిటీలో ఉంటూ అనేక సేవలు అందించాలని పేర్కొన్నారు. ధరూరు పుల్లయ్య మరణముతో నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన ఒక తరం అంతరించిందని తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తులసీదాసు నాయక్, బి జి ఎస్ నేత మహేష్ బంజారా బంజారా సంఘం ప్రతినిధి ఎస్కే సుబ్రహ్మణ్యం నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు.

డ్రైవర్స్ డేను అధికారికంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని హెూండా షోరూం ఆవరణలో మంగళవారం సేఫ్టీ డ్రైవర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫౌండర్ సౌత్ ఇండియా ప్రెసిడెంట్ అన్వర్ భాష,ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ రామకృష్ణ యాదవ్ ఆంధ్ర ప్రదేశ్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లకి ఒక రోజు ఉండే విధంగా అధికారికంగా డ్రైవర్స్ డే ను ప్రకటించి ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు.డ్రైవర్స్ కి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి తద్వారా మా రంగానికి కావలసిన ప్రమాదవశాత్తు డ్రైవర్ యాక్సిడెంట్ లో చనిపోతే అతని యొక్క కుటుంబాన్ని తక్షణమే 25 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రభుత్వమే అతని కుటుంబానికి అందజేయాల న్నారు. అదేవిధంగా డ్రైవర్స్ కి కావాల్సిన ఇల్లు, స్థలాలు ఇన్సూరెన్స్ పాలసీ, లాంటి కనీస అవసరాలను ప్రభుత్వం గుర్తించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ భాష గుత్తి సెక్రెటరీ,రసూల్, శ్రీరాములు వెంకటయ్య, పఠాన్ ఫరూక్ ,కంబగిరి, రసూల్, మహమ్మద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతా ఉద్వాసన..

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం వారి బ్రహ్మోత్సవ వేడుకలు 10వ రోజు దాతలు, భక్తాదులు, ఆలయ ఈవో వెంకటేశులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం దేవతా ఉద్వాసన కార్యక్రమాన్ని అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు ,చక్రధర్ లు వేదమంత్రాలు ,మంగళ వాయిద్యాలయం ప్రత్యేక అర్చనలు, పూజలు ఉత్సవ విగ్రహాలకు చక్కటి అలంకరణ గావించారు. దేవతా ఉద్వాసన కార్యక్రమానికి ఉభయ దాతలుగా వ్యవహరించిన మాగలూరు జగన్మోహన్ గుప్తా, ఎం.గంగాధర్ గుప్తా, ఎం.సురేష్ బాబులు వ్యవహరించారు. వారి పేరిటన ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి వారిని చైర్మన్ ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం అర్చకులు మాట్లాడుతూ 9వ రోజు చెన్నకేశవ స్వామి వారికి దేవత ఉద్వాసన కార్యక్రమంలో భాగంగా బ్రహ్మోత్సవాలకు హాసీనులైన బ్రహ్మ, పరమేశ్వరులు ఇంద్రాది అష్ట దిక్పాలకులకు తాంబూలాలతో సత్కరించి, వారి యథాలోకాలకు సాగనంపడే దేవతా ఉద్వాసన కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యము అని తెలిపారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి గరుత్మంతుని చిత్రపటంతో దేవతలను సాగనంపడం జరిగిందని తెలిపారు. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య వారి శిష్య బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉభయ దాతలతో పాటు ఆలయ సిబ్బంది రామశాస్త్రి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-తాడిపత్రి : ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్పీ జగదీశ్ ఆదేశాల మేరకు ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి ఉత్తర్వుల మేరకు రాబడిన సమాచారం మేరకు రూరల్ ఎస్సై కె.కాటయ్య టౌన్ ఎస్సై గౌస్ బాషా పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం మధ్నాహ్నం 3.00 సమయంలో మండలంలోని చుక్కలూరు ఫ్యాక్టరీ శివార్లలో కంపచెట్లల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.37,210ల నగదు, 5 మొబైల్ ఫోన్లు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ముఖ్యంగా మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా గ్యాంబ్లింగ్ నిర్వహిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.